

మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాదీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, వాణీదేవి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు

రేపు పుస్తెలతాళ్లూ లాక్కెళ్తరా?

మొదటిపేజీ తరువాయి...

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ గురించి తప్ప.. స్టేట్ గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎలాంటి సోయి లేదని ధ్వజమెత్తారు. సీఎం అండ్ బ్రదర్స్ పెద్ద ఎత్తున భూ దందాలకు పాల్పడుతున్నారని, వారు సంపాదించిన భూముల ధరలను పెంచుకొనేందుకే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేస్తున్నారని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు మహాదీక్షలో కేటీఆర్ మాట్లాడారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఏఒక్క రైతుకు కూడా రేవంత్ సర్కార్ రుణమాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రుణ మాఫీయే చేసిందని, రైతులంతా వెంటనే బ్యాంకులకు వెళ్లి రెండు లక్షల రుణాలు తీసుకోవాలని, తాను అధికారంలోకి రాగానే మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం లక్ష రూపాయలు, తులం బంగారం, మహిళలకు రూ.2500, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని చెప్పి పూర్తిగా గాలికొదిలేశారని పైర్ అయ్యారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, గ్యాస్ సిలిండర్‌కు సబ్సిడీ రూ.500 వంటి హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయటం లేదని, 420 దొంగ హామీలిచ్చి నంగనాచి మాటలు చెప్పి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని నిప్పులు చెరిగారు. హామీలిచ్చి మోసం చేయటంలో రేవంత్‌రెడ్డి తనకు తానే సాటి అని ఎద్దేవాచేశారు.

బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో 12 పంట సీజన్లు వచ్చాయని, రాష్ట్రంలో 73 వేల కోట్ల రూపాయలను రైతుబంధు ద్వారా అందించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున రైతు బీమా కింద అందించారని, రాష్ట్రంలో మొత్తం 70 వేల మంది రైతులకు ప్రతి సీజన్‌కు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 35 సార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి 35 రూపాయలు కూడా తేలేదని ఎద్దేవాచేశారు.

ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాదీక్షకు ఊరేగింపుగా వెళ్తున్న కేటీఆర్

కులగణన అంతా మోసం

రాష్ట్రంలో రేవంత్ సర్కార్ చేపట్టిన కులగణన అంతా మోసపూరితమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి, దాటవేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కులగణనలో తమకు జరిగిన అన్యాయంపై బీసీలంతా ముక్తకంఠంతో నిలదీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 430 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రుణమాఫీ కాక, రైతబంధు రాక అనేకమంది చనిపోతున్నారని వాపోయారు. మరోవైపు ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గురుకుల విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 1,022 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1.20 లక్షలు ఖర్చుచేసి వారికి ఉన్నత చదువులు అందించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత గురుకులాలను విస్మరించటంతో ఇప్పటి వరకు 56 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని, నాసిరకం భోజనం పెట్టడంతో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

పాలమూరును పచ్చగా చేసింది కేసీఆరే

వలసల పాలమూరును పచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతును రాజును చేయాలనే ఉదేశంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 90 శాతం పనులు పూర్తిచేశారని, పాలమూరు జిల్లాలో అనేక ప్రాంతాలకు సాగునీరు రావటంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకున్నారని గుర్తుచేశారు. 10 శాతమే మిగిలి ఉన్న పాలమూరు ఎత్తిపోతల పథకం పనులకు పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి తనమామ జైపాల్‌రెడ్డి పేరు పెట్టుకున్నా పూర్తిచేసి సాగునీరు అందించటం లేదని దుయ్యబట్టారు. పాలమూరును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో జిల్లాలో మళ్లీ కరువు ఛాయలు అలుముకున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. పాలమూరు, రంగారెడ్డి పథకాన్ని పూర్తిచేసి ఈ ప్రాంతంలో పుట్టిన రుణం తీర్చుకోవాల్సిన ముఖ్యమంత్రి మొత్తానికే పట్టించుకోకపోవటం శోచనీయమని విమర్శించారు. పుట్టి పెరిగిన కల్వకుర్తిని.. పిల్లనిచ్చిన మాడ్గులను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, ఈ ప్రాంత ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లేయించుకుని ముఖ్యమంత్రి అయిన తర్వాత రూపాయి కూడా కేటాయించలేదని, ఇక్కడి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని దుయ్యబట్టారు.

స్థానిక ఎన్నికల్లో రేవంత్‌కు షాక్ ఇవ్వాలి

420 హామీలిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్థానిక సంస్థల ఎన్నికల్లో దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలని, ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలని ప్రజలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు రాక అనేక మంది గత సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారని, చాలా మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ దరిద్ర పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, రైతులు, మహిళలు, చేనేత కార్మికులు, ఆటోడ్రైవర్లు, వృద్ధులు, వితంతువులు ముఖ్యమంత్రిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ప్రభుత్వంపై పోరు సల్పుతామని తేల్చిచెప్పారు. మహాదీక్షలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు విజయుడు, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, మర్రి జనార్ధన్‌రెడ్డి, అల వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సస్యశ్యామలం: నిరంజన్‌రెడ్డి

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పాలమూరు జిల్లా సస్యశ్యామలమైందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీరందించారని చెప్పారు. జిల్లాలో బీడు పడిన భూములన్నీ పచ్చని పంటపొలాలతో విరాజిల్లుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు, రంగారెడ్డిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు.

గుణపాఠం చెప్పాలి: శ్రీనివాస్‌గౌడ్

ప్రజలను మోసంచేసి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. హామీలు నెరవేర్చకుండా ఓట్లకోసం ఇండ్ల వద్దకు వచ్చే నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

రియల్ ఎస్టేట్ కుదేలు

'ఎన్నికల తర్వాత కల్వకుర్తి ప్రాంతంలో దాదాపు వెయ్యికరాల భూమిని రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులు సంపాదించుకున్నరు. భూముల ధరలు పెంచుకోవటం కోసమే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేస్తున్నరు. ఆ రోడ్డు సమీపంలోనే వాళ్ల భూములున్నయి. పేరుకే ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్ సిటీ.. వాటి పరిసరాల్లో వేలాది ఎకరాలు ముఖ్యమంత్రి అండ్ బ్రదర్స్ కొనుగోలు చేసిండ్రు. రియల్ ఎస్టేట్‌తో ఇతరులు బాగుపడొద్దని ముఖ్యమంత్రి ఆయన సోదరులు కంకణం కట్టుకున్నరు. రియల్‌ఎస్టేట్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఇటీవల రియల్ ఎస్టేట్ రంగంలో నష్టాలు వచ్చి వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యాపారి ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల ప్రాంతాల్లో సీఎం ఆయన బంధువులు, సోదరులు పెద్ద ఎత్తున భూదందాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

> బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో 12 పంట సీజన్లు వచ్చినయ్. రాష్ట్రంలో 73 వేల కోట్ల రూపాయలను రైతుబంధు ద్వారా అందించిన ఘనత కేసీఆర్‌దే. రైతు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున రైతు బీమా కింద ఇచ్చిండు. రాష్ట్రంలో మొత్తం 70 వేల మంది రైతులకు ప్రతి సీజన్‌కు పెట్టుబడి సాయం అందించిండ్రు.
> -కేటీఆర్

- కేటీఆర్‌కు చిన్నారి హాయ్..

ర్యాలీలో కేటీఆర్‌కు హాయ్ చెప్తున్న చిన్నారి

- యువనేతకు అభివాదం

ర్యాలీగా వెళ్తున్న కేటీఆర్‌కు అభివాదం చేస్తున్న స్థానికుడు

గురుకులాల్లో ఆర్తనాదాలు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలను పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, విద్యార్థులు ఆకలి చావుల పాలవుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని, రాష్ట్రంలో 1022 గురుకులాను ఏర్పాటు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని వాపోయారు.

పుట్టిన ప్రాంతంపైనా సీఎంకు శ్రద్ధలేదు : మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సొంత నియోకవర్గం కల్వకుర్తిపైనా ఎలాంటి శ్రద్ధలేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు. మహాత్మాగాంధీ ఎత్తిపోతల ద్వారా కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, మాడ్గుల ప్రాంతాలకు సాగునీరు అందించిన ఘనత, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 90 శాతం పూర్తిచేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.700 కోట్లతో ఈ ప్రాంతానికి కేసీఆర్ సాగునీరు అందించారని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌కు అర్హత లేదు : గువ్వల బాలరాజు

రైతులను పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నదని నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయని కాంగ్రెస్‌కు ఒక్కరోజు కూడా అధికారంలో కొనసాగే నైతిక హక్కులేదని ధ్వజమెత్తారు.

> హామీలిచ్చి మోసం చేయటంలో సీఎం రేవంత్‌రెడ్డి తనకు తానే సాటి.. 420 దొంగ హామీలిచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. రైతులకు 2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఏ ఒక్క రైతుకు కూడా చేయలేదు.
> - కేటీఆర్

ఆమనగల్లు బీక్షకు వెళ్తూ మైసిగండి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుంటున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు

సీఎం పేరు మర్చిపోతున్నరు!

- క్యాబినెట్ మంత్రికే గుర్తుండటం లేదు
- సొంత పార్టీ నేత కూడా పలుకడం లేదు
- మొన్న అల్లు అర్జున్, నిన్న జగ్గారెడ్డి, నేడు మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎం కేటీఆర్ అన్న మంత్రి జూపల్లి
- జూపల్లి మంత్రి పోస్టు ఊస్టేమో: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 15 నెలలు అవుతున్నా, ఆయన పేరును క్యాబినెట్ మంత్రులు, సొంత పార్టీ నేతలు, ఇతర ప్రముఖులు సైతం మర్చిపోతున్నారు. ఎక్కడైనా ప్రైవేటు, వ్యక్తిగత కార్యక్రమాల్లో మర్చిపోతే ఓకే గానీ, బహిరంగసభల్లో, అధికారిక ప్రెస్‌మీట్లలోనే సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు పలుకలేకపోతున్నారు. నిత్యం కలిసి ఉండే క్యాబినెట్ మినిస్టర్, సొంత జిల్లాకు చెందిన సొంత పార్టీ నేత ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు సంబోధించడంలో తడబాటుకు గురవుతున్నారు. సీఎల్పీలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యమంత్రి కేటీఆర్ అని సంబోధించారు. మళ్లీ తప్పును సవరించుకొని ప్రెస్‌మీట్ కొనసాగించారు. 2024 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత క్యాబినెట్ మినిస్టర్‌గా జూపల్లి బాధ్యతలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌కు చెందిన జూపల్లి.. నిత్యం ఆయనతోనే అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతుంటారు. అయినా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరు గుర్తుకురాకపోవడం శోచనీయమని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని గుర్తించడం లేదా? లేక గుర్తుపెట్టుకోవడం లేదా? గుర్తు పెట్టుకొనేలా ఆయన పని తీరు లేదా? కావాలనే పలుకడం లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ఆయన పలుకకపోవడం ఇదే మొదటిసారి కాదు.. ఇదే చివరిసారి కూడా కాబోదేమో!

నా పేరు చెప్పకోండి మీలో ఎవరైనా!

మొదట జనవరి 7వ తేదీన పుష్ప-2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ నటుడు అల్లు అర్జున్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోయారు. 'తెలంగాణ సీఎం..' అని ఆగిపోయారు. ఎంతగానో ప్రయత్నిస్తే తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని చెప్పలేకపోయారు. ఈ తడబాటును కవర్ చేయడానికి ఆయన చాలా కష్టపడ్డారు. మంచినీళ్లు తాగి పక్కవారిని అడిగి రేవంత్‌రెడ్డి పేరు పలికారు. అనంతరం పుష్ప సినిమా ప్రదర్శన సందర్భంగా చోటుచేసుకున్న ఘటనతో అల్లు అర్జున్ ఒక రోజు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోవడమే కారణమంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. గత నెల 5వ తేదీన హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన తెలుగు ప్రపంచ సమాఖ్య కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. సభా ప్రాంగణంలోకి రాగానే కార్యక్రమ వ్యాఖ్యాత కూడా సీఎం రేవంత్‌రెడ్డి పేరును మర్చిపోయారు. 'తెలంగాణ ముఖ్యమంత్రి, గౌరవనీయులు శ్రీ కిరణ్‌కుమార్‌గారు..' అని సంబోధించి ఆ తరువాత సవరించుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు పలుకలేకపోయారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో 'మన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి' అని అన్నారు. ఆ తర్వాత సారీ చెప్పి సర్దుకున్నారు. తాజాగా మంగళవారం కాంగ్రెస్ ఎల్పీలో మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎంగా కేటీఆర్ పేరును సంబోధించారు. ఆ తర్వాత సవరించుకొని రేవంత్ పేరు పలికారు. సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు పలుకకపోవడంతో జూపల్లి మంత్రి పదవి ఊడిపోవచ్చని సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. కాంగ్రెస్ మంత్రులకు, సీనియర్ నేతలకు కూడా సీఎం ఎవరో తెలియదా? అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.

క్యాబినెట్ నుంచి తప్పిస్తరు: కేటీఆర్

ప్రెస్‌మీట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు పలుకనందుకు మంత్రి జూపల్లి కృష్ణారావును క్యాబినెట్ నుంచి తప్పిస్తరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు జోస్యం చెప్పారు. సీఎం పేరును తప్పుగా పలికినందుకు కృష్ణారావుకు శిక్ష తప్పదేమోనని తెలిపారు. 'నా మాటలు గుర్తుంచుకోండి. ఈ తప్పునకు క్యాబినెట్ నుంచి జూపల్లిని తొలగిస్తారు' అని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.